క్లుప్తంగా

పాడి రైతులకు బోనస్ పంపిణీ



గూడూరు: గూడూరు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో రైతులకు 2022 డిసెంబర్ నుంచి 2023 మార్చి మధ్య కాలానికి బోనస్ పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. సంఘంలోని 30 మంది రైతులకు రూ.92,825 బోనస్ పంపిణీ చేశామని సంఘం అధ్యక్షుడు గొరిపర్తి కృష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మోర్ల నాంచారయ్య, ఆకునూరి శ్రీరామ్మూర్తి, వల్లభరావు, చోడిబోయిన రామయ్య, తోట నాంచారయ్య, పోతన వెంకట్రామయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి పోలాశమ్మ జాతర



పులిగడ్డ(అవనిగడ్డ): పులిగడ్డలోని గ్రామ దేవత పోలాశమ్మ అమ్మవారి జాతర శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు జరిగే జాతర సందర్భంగా అమ్మవారు గ్రామంలో ఊరేగుతారు.

స్నాతకపు కావిడి సమర్పణ

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీ నారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారికి విశేష హోమం, స్నాతకపు కావిడి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. నిత్యహోమం, బలిహరణం అనంతరం పోతరాజు గోపాలకృష్ణ–సృజన దంపతులు స్వామి వారికి స్నాతకపు కావిడిని సమర్పించారు. అర్చకులు పురుష సూక్తులు, శ్రీసూక్తములు చేశారు. వెంకట్రామాచార్యులు, పార్థ వెంకటరావు శ్రీనివాసాచార్యులు, వేణుగోపాలాచార్యులు, దీవి రఘులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ సీతారామయ్య, ధర్మకర్త భాస్కరరావు పర్యవేక్షించారు.

నేడు వేణుగోపాలుడి కల్యాణం

కోడూరు: మండలంలోని పాదాలవారిపాలెం గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణాన్ని శుక్రవారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తామని ఆలయ ఈఓ సుధాకర్ గురువారం తెలిపారు. వేణుగోపాలుడి మూలమూర్తికి ప్రత్యేక అలంకారం, కల్యాణ మూర్తులకు గ్రామోత్సవం జరుగుతుందన్నారు. కల్యాణాన్ని పురస్కరించుకొని ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశామని ఈఓ తెలిపారు. కల్యాణం ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ పరిశె భిక్షాలు పరిశీలించారు.

కిడ్నీ బాధితుడికి సాయం

మచిలీపట్నంటౌన్: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. నగరం శివారులోని గిలకలదిండికి చెందిన ఒడుగు గాయత్రి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న సహాయ ఫౌండేషన్ ప్రతినిధులు ఆస్పత్రికి వెళ్లి రూ. 10 వేల చెక్కును అందజేశారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజలు

చల్లపల్లి: లక్ష్మీపురం శివారు శివరామదుర్గాపురం (పద్మశాలిపేట)లో నూతనంగా నిర్మించిన దేవాలయంలో భద్రావతీ సమేత భావనారుషి స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠ మూర్తులకు పూజలు, మంటప దేవతా హోమం శాస్త్రోక్తంగా జరిగాయి. విగ్రహ దాతలు అందే లక్ష్మణస్వామి–విజయలక్ష్మీ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. భమిడిపాటి బాలసుబ్రహ్మణ్యశాస్త్రి బ్రహ్మత్వంలో ప్రతిష్ఠ మహోత్సవ పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 10.49 గంటలకు స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

స్టాండింగ్‌క్రాప్ ఎన్యూమరేషన్ చేయాలి

పామర్రు(తోట్లవల్లూరు): మండలంలో కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న స్టాండింగ్ క్రాప్(పంట కొయ్య)కు ఎన్యూమరేషన్ చెయ్యాలని గ్రామ రెవెన్యూ అధికారులను ఆదేశించామని తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వీఆర్వో, వీఏఏలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండల పరిధిలో మొక్కజొన్న, జొన్న, వరి, అరటి, పసుపు తదితర పంటలు కోయకుండా ఎన్యూమరేషన్ చేయడానికి 16 బృందాలను ఏర్పాటుచేశామన్నారు. ఈ టీములు శుక్రవారం నుంచి ఐదురోజుల పాటు మండలంలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తాయని చెప్పారు. అభ్యంతరాలు ఉంటే తహసీల్దార్ దృష్టికి తీసుకురావాలన్నారు.

ప్రభుత్వ కళాశాలకు మహర్దశ

- నాడు–నేడుతో అభివృద్ధి పనులు
- రూ.62.43 లక్షలతో అంచనాలు
- మొదటి విడతగా రూ.9 లక్షలతో టాయిలెట్ల నిర్మాణం
- రెండో విడత నిధులు రూ.7.50 లక్షలతో ల్యాబ్‌ల ఆధునికీకరణ



బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల

పెడన: పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నాడు–నేడు పథకం కింద నిధులను కేటాయించడంతో కళాశాలలో వసతులు సమకూరుతున్నాయి. రూ.62.43 లక్షల అంచనాలతో వివిధ పనులను చేయడానికి గత ఏడాది నవంబర్‌లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. మొదటి విడతగా రూ.9 లక్షలు మంజూరు కావడంతో టాయిలెట్లను నిర్మించారు. తాజాగా రెండో విడతగా రూ.7.50 లక్షల నిధులు విడుదల కావడంతో ల్యాబ్‌లను ఆధునికీకరిస్తున్నారు. అనంతరం వచ్చే నిధులతో సెమినార్ హాల్, ల్యాబ్‌ల చుట్టూ ప్రహరీ, తాగునీటికి, వాడకానికి వినియోగించేందుకు సంపులను నిర్మించనున్నారు.

సైన్స్ ల్యాబ్‌ల ఆధునికీకరణ

ప్రస్తుతం కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులతో పాటు ఒకేషనల్ కోర్సులు నిర్వహిస్తున్నారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సైన్స్ ల్యాబ్‌లు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటని, జువాలజీ ల్యాబ్‌ల ఆధునికీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తద్వారా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. పనులను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

నాణ్యతా ప్రమాణాలపై పర్యవేక్షణ



నాడు– నేడు పథకం ద్వారా కళాశాలలో జరుగుతున్న పనులను పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తున్నాం. అధ్యాపకులతో పాటు ప్రిన్సిపాల్, నేను, ఇతర సభ్యులు కూడా వచ్చి పనులు ఏవిధంగా చేస్తున్నారో నిశితంగా పరిశీలించి అవసరమైన సూచనలు చేస్తున్నాం.

– హఫీజ్ అబ్దుల్ గఫార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్, పెడన

కళాశాల తెరిచే నాటికి పనులు పూర్తి



రెండో విడతలో ల్యాబ్‌లను ఆధునికీకరిస్తున్నాం. ఈ పనులు కళాశాల పునఃప్రారంభించే నాటికి పూర్తి చేస్తాం. అనంతరం వచ్చే నిధులతో కళాశాలలో సెమినార్‌హాల్ నిర్మిస్తాం. కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అధ్యాపకులతో కలిసి తగు చర్యలు తీసుకుంటున్నాం.

– కేసీఎస్‌వీ రామారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- మాచవరంలో గడప గడపకు మన ప్రభుత్వం



బ్రోచర్ అందజేసి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతూ సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని వి.కొత్తపాలెం సచివాలయ పరిధిలోని మాచవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, యువనేత వికాస్‌లు చినమాచవరం, పెదమాచవరం గ్రామాల్లోని 503 ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. కుటుంబ సభ్యులు పొందిన లబ్ధిని వివరించి, ప్రత్యేకంగా ముద్రించిన బుక్‌లెట్‌ను అందించారు. పార్టీలకు అతీతంగా అర్హత ఉన్నవారందరికీ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రమేష్‌బాబు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి గ్రామీణ ప్రాంతాల ప్రజలు విసిగిపోతున్న తరుణంలో సచివాలయాలను ప్రారంభించి, వలంటీర్ల ద్వారా నేరుగా ఇంటి వద్దకే పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అన్నదాతల శ్రేయస్సు కోసం రైతు భరోసా కేంద్రాలు, ప్రజా ఆరోగ్య పరిరక్షణ కోసం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, మహిళల ఆర్థిక స్వావలంబనకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం దేశ చరిత్రలో ఇదే ప్రథమమని రమేష్‌బాబు అన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

సమస్యలు తెలుసుకుంటూ.. ముందుకు సాగుతూ..

గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకుంటూ రమేష్‌బాబు, వికాస్‌లు కార్యక్రమాన్ని నిర్వహించారు. రహదారులు, డ్రెయినేజీ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రమేష్‌బాబు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అద్భుతంగా ఉందని, ఏ కార్యాలయానికి, అధికారి వద్దకు వెళ్లకుండా పథకాలు తమ ఇంటికే వస్తున్నాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, వైస్ ఎంపీపీ ముక్కు వెంకటేశ్వరరావు, సర్పంచులు అప్పికట్ల లక్ష్మీ, యలవర్తి నాంచారయ్య, తన్నీరు కృష్ణారావు, రైతు సంఘం నేత రేపల్లె రాజయ్య, ఎంపీడీఓ పాండురంగారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల, పోర్టు శంకుస్థాపన పనుల పరిశీలన



మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని 36వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణులు గురువారం నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల పనులు, పోర్టు శంకుస్థాపన పనులను పరిశీలించారు. డివిజన్ కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్ నేతృత్వంలో డివిజన్ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు ప్రత్యేక వాహనంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనుల వద్దకు చేరుకుని ఇప్పటికే నిర్మించిన భవనాలను పరిశీలించారు. నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గిలకలదిండి సముద్ర తీరాన జరుగుతున్న ఫిషింగ్ హార్బర్ పనులను పరిశీలించారు.

ఈఓపీఆర్డీ రజావుల్లాకు పదోన్నతి



గూడూరు: గూడూరు మండలం ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న మహ్మద్ రజావుల్లాకు డీఎల్‌పీఓగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎ.సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం గూడూరు మండలంలో పనిచేస్తున్న రజావుల్లా పదోన్నతిపై ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం డివిజనల్ పంచాయతీ అధికారిగా వెళ్లనున్నారు. రజావుల్లాకు డీఎల్‌పీఓగా పదోన్నతి లభించడంపై ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్‌రంగబాబు, ఎంపీడీఓ డి.సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు

మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ



సచివాలయ రికార్డులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

గుడివాడరూరల్: సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని గుడివాడ మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని 25, 26, 28, 29వ వార్డు సచివాలయాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల పనితీరు, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను పేదలందరికీ అందజేయడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తొలుత సంక్షేమ పథకాల రికార్డులను, పర్సనల్, సెలవుల రిజిస్టర్లను, మూమెంట్ రిజిస్టర్లను తనిఖీ చేసి సచివాలయ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఉద్యోగులు రికార్డుల నిర్వహణ, సమయ పాలనలో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఉండాలని, స్పందన, జగనన్నకి చెబుదాం కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి రూ.10 వేలు సాయం

చల్లపల్లి: మండల పరిధిలోని కొత్తమాజేరులో విద్యుదాఘాతంతో మృతిచెందిన రైతు యన్నం సాంబశివరావు కుటుంబానికి మాజేరు పీఏసీఎస్ ద్వారా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. మృతుని భార్య పద్మకు సొసైటీ చైర్మన్ అరజా శివశంకర్ ఈ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ కమిటీ సభ్యుడు మోతుకూరి నాగమల్లేశ్వరరావు, పల్లె కోటేశ్వరరావు, సీఈఓ ఎస్ఎస్ చక్రపాణి పాల్గొన్నారు.

కనుల పండువగా జగజ్జ్యోతి



జగజ్జ్యోతి పూజలు చేస్తున్న దంపతులు

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని భావన్నారాయణ స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జగజ్జ్యోతి కార్యక్రమం కనుల పండువగా జరిగింది. తొలుత అర్చన, నిత్యహోమం, బలిహరణ పూజలు జరిగాయి. అనంతరం అవనిగడ్డలోని అర్చన నృత్యాలయం విద్యార్థుల కూచిపూడి నృత్యాలు అలరించాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి పామర్తి సీతారామయ్య పర్యవేక్షణలో పూజాదికాలు నిర్వహించారు., శుక్రవారం రథోత్సవం, మహా అన్నసమారాధన జరుగుతాయని ఈఓ తెలిపారు.

కోడూరులో భారీ వర్షం



కోడూరు: కోడూరు, చుట్టుపక్కల గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. గంట పాటు వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లోకి వర్షంనీరు చేరింది. అంబటి బ్రాహ్మణయ్య కాలనీ, వీవర్స్ కాలనీ, వడ్డెర కాలనీతో పాటు ఉల్లిపాలెం, స్వతంత్రపురం గ్రామాల్లో రహదారులపై వర్షం నీరు నిలిచింది. అకాల వర్షంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వరికుప్ప నూర్పిళ్లు చివరి దశలో ఉండగా వర్షం పడుతుండటంతో అన్నదాతలు ఇబ్బందుకుల గురయ్యారు. వర్షం నీరు పొలాల్లో నిల్వ ఉండటంతో యంత్రాలు, వాహనాలు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది.

బంగారు నేత్రాల సమర్పణ

ముదినేపల్లి రూరల్: అల్లూరు శ్రీపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో గురువారం అమ్మవారికి బంగారు నేత్రాలను దాతలు బహూకరించారు. దివ్య కల్యాణ మహోత్సవాలు వేదపండితుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గెల్లి ప్రసాద్ దంపతులు పార్వతీదేవికి రూ.50 వేలు విలువ చేసే 7 గ్రాముల బంగారు నేత్రాలను ఆలయ చైర్మన్ గుళిపల్లి సుధారాణి, శ్రీనివాస్ దంపతులకు అందజేశారు. ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, ప్రధాన అర్చకుడు ఐలూరు సుబ్రహ్మణ్యం, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రేపు నృత్య ప్రదర్శనలు

గుడివాడరూరల్: కళాజ్యోతి సమ్మేళనం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న క్లాసికల్, ఫోక్ నృత్య ప్రదర్శలను విజయవంతం చేయాలని ప్రోగ్రామ్ ఆర్గనైజర్ సరితనెహ్రూ తెలిపారు. గుడివాడలో గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ గుడివాడ అలంకృత ఫంక్షన్ హాల్‌లో సాయంత్రం 6 నుంచి రాత్రి 9గంటల వరకు క్లాసికల్, ఫోక్ నృత్య ప్రదర్శనలు జరుగుతాయన్నారు.

గోడౌన్ల నిర్మాణానికి స్థలాలను గుర్తించండి

కలెక్టర్ రాజాబాబు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు. చిత్రంలో జేసీ అపరాజితసింగ్, డీఆర్వో వెంకటేశ్వర్లు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రీ–సర్వే, జాతీయ రహదారుల భూ సేకరణ, స్పందన, జగనన్న ఇళ్ల నిర్మాణాలు, జగనన్న పాలవెల్లువ, ఉపాధి హామీ పథకం, ఆధార్ నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో జరుగుతున్న ఆయా అంశాలకు సంబంధించిన పురోగతి వివరాలను సీఎస్‌కు కలెక్టర్ వివరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాల్సి ఉందన్నారు. అందుకు అవసరమైన స్థలాలను గుర్తించి నిర్మాణాలను చేపట్టాలని చెప్పారు. నిర్దేశిత సమయంలోనే స్పందన అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాల పురోగతిలో ముందంజలో ఉన్నామని, అధికారులు మరింత శ్రద్ధ చూపి వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని చెప్పారు. అన్ని లేఅవుట్లలో తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు మెటీరియల్ కొరత లేకుండా చూడాలన్నారు. అవసరమైన వారికి రుణాలు మంజూరు చేయించాలని చెప్పారు. ఉపాధి హామీ కూలీలకు గతంలో చెల్లించాల్సిన నగదు విషయంలో బ్యాంక్ అకౌంట్ నెంబర్లలో తప్పులు రావడం, ఆధార్ నమోదు కాకపోవడం వంటి సాంకేతిక సమస్యలను గుర్తించామని, వాటిని సరిచేసి నగదు జమ అయ్యేలా చూడాలన్నారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు తదితర భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ అపరాజితసింగ్, డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

సీతారావమ్మ కుటుంబ సభ్యులకు మంత్రి అంబటి పరామర్శ



సీతారావమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి, ఎమ్మెల్యే సింహాద్రి

కోడూరు: కోడూరులోని ఇస్మాయిల్‌బేగ్ పేట గ్రామంలో ఇటీవల మృతిచెందిన కోట సీతారావమ్మ కుటుంబ సభ్యులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గురువారం పరామర్శించారు. సీతారావమ్మ భర్త దివంగత కోట కేశవ పెరుమాళ్లు పంచాయతీలు ఏర్పడక ముందు కోడూరు సమితి అధ్యక్షుడిగా పని చేశారు. సీతారావమ్మ కుమారుడు కోట పద్మావతి వరప్రసాద్ వైఎస్సార్ సీపీ ముఖ్య నేతగా వ్యవహరిస్తున్నారు. రాంబాబు, రమేష్‌బాబులు మృతురాలి ఇంటికి వచ్చి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుమారులు పద్మావతి వరప్రసాద్, సంపత్‌కుమార్, వేణుగోపాల కృష్ణప్రసాద్, శ్రీనాథ్‌లకు సానుభూతి తెలిపారు. పార్టీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో సంక్షేమం

పథకాలతో లబ్ధి పొందామంటున్న మహిళలు



కరపత్రాలు అందజేస్తున్న బేతపూడి రవి

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేస్తుండటంతో తాము ఎంతగానో లబ్ధి పొందామని పలువురు మహిళలు పేర్కొన్నారు. నగరంలోని 46వ డివిజన్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం గురువారం నిర్వహించారు. కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవితో పాటు సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలపై ముద్రించిన కరపత్రాలను అందజేశారు. ప్రజల అంగీకారంతో వారి గృహాలపై, సెల్‌ఫోన్లపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంతో కూడిన స్టిక్కర్ అంటించారు. సచివాలయ కన్వీనర్లు సత్తెనపల్లి శ్రీనివాసరావు, తుమ్మలచెరువు మురళీ, జూనపూడి సుధాకర్, వలంటీర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల కిట్ల పంపిణీ



మహిళా రైతులకు కిట్లు అందజేస్తున్న ఏఓ శివప్రసాద్

కోనేరుసెంటర్: మండల పరిధిలోని పొట్లపాలెం రైతు భరోసా కేంద్రంలో గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు, మహిళా రైతులకు నవధాన్యాల కిట్లును వ్యవసాయశాఖ అధికారులు గురువారం పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి జీవీ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం తరపున అందించే కిట్లను ఎకరాకు 13 కిలోల చొప్పున ఉపయోగించాలన్నారు. తొమ్మిది రకాల జాతుల విత్తనాలతో కలిపి 32 రకాలు ఈ వేసవిలో వేయడం వల్ల నేలలో కోతను అరికట్టి జీవ వైవిధ్యం పెరుగుతుందన్నారు. సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది మిత్ర పురుగులు పెరుగుతాయన్నారు. శత్రు పురుగులు బెడద అరికట్టవచ్చని చెప్పారు. వర్షం నీటిని నేలలో నిల్వ ఉంచుకునే సామర్థ్యం పెరిగి భూ తాపం తగ్గుతుందన్నారు. అలాగే పశువులకు గ్రాసం ఉపయోగపడి అదనపు ఆదాయాన్ని అందజేస్తుందని వివరించారు. మహిళా రైతులు, రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జ్ ఝాన్సీ, సిబ్బంది లతాశ్రీ, సుమ, ఇందిర, కవిత, ఉమా తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకూ తాగునీటి సౌకర్యం



రాజుల కొట్టాడలో తాగునీటి పైపులైనుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ అడవి కృష్ణ

కైకలూరు: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నారని ఎంపీపీ అడవి కృష్ణ చెప్పారు. కొట్టాడ పంచాయతీ పరిధి రాజుల కొట్టాడలో జలజీవన్ మిషన్ నిధులు రూ.9.28 లక్షలతో చేపట్టనున్న పైపులైన్ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ కొల్లేరు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కృషి చేస్తున్నారని చెప్పారు. నూతన పైపులైను ఏర్పాటుతో రాజుల కొట్టాడలో 220 కుటుంబాలకు తాగునీటి సమస్య తీరుతుందన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ దండే పుష్పలత, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, సర్పంచ్ కొల్లాటి పద్మావతి, ఎంపీటీసీ సిద్ధబట్టిన సువర్ణ, పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగబాబు, పంచాయతీ ఈఓ డి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి విరాళం

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి దాతలు గురువారం విరాళమందించారు. బంటుమిల్లి మండలం జయపురం గ్రామానికి చెందిన అబ్బూరి శివపూర్ణపరమేశ్వరరావు, తులసీ దంపతులు అంతరాలయ ముఖద్వారానికి వెండి తాపడం నిమిత్తం రూ.10,116 విరాళాన్ని స్వామిసన్నిధిలో ఆలయ అర్చకుడు తోలేటి శివశంకరశర్మకు అందజేశారు.